### శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డులో
## ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులు నియామకం



శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు నూతన నియామకంతో పాటు ప్రత్యేక ఆహ్వానితులును శివరాత్రి రోజున నియమించిన సంగతి తెలిసిందే. తొలుత ప్రత్యేక ఆహ్వానితులను 9మందిని నియమించారు. కాగా గురువారం మరో 5మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తూ దేవాదాయశాఖ జివోను విడుదల చేశారు. ఇందులో భాగంగా ప్రత్యేక ఆహ్వానితులుగా సూరా సురేష్, పి.మునిచంద్ర, సి.రుష్యేంద్రమణి, కె.సుశీల, ఎల్.సుందరరామిరెడ్డిలను నియమించారు. ఈ మేరకు ఆలయంలోని దక్షిణామూర్తి వద్ద నూతనంగా నియమితులైన ప్రత్యేక ఆహ్వానితులకు ఎంఎల్ఏ సతీమణి బియ్యపుశ్రీవాణి నియామక పత్రాలను అందించి అభినందించారు. ఇఓ ఎస్వి.నాగేశ్వరరావు ప్రత్యేక ఆహ్వానితులచే ప్రమాణస్వీకారం చేయించి స్వామి తీర్థప్రసాదాలను అందించారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## భక్తుల భద్రతే లక్ష్యం!
### రద్దీ ప్రాంతాల్లో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల, మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి:



ఏడుకొండల్లో భద్రతపై మరోసారి ఆక్టోపస్ బలగాలు గురువారం సాయంత్రం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. వేసవిసెలవుల రద్దీకి ముందుగానే ప్రపంచ ప్రఖ్యాతిచెందిన కలియుగ వైకుంఠం తిరుమల ఆలయ భద్రతతో బాటు భక్తుల రక్షణకు ఆక్టోపస్, విజిలెన్స్ విభాగం వీఎస్ఓ నందకిశోర్ పర్యవేక్షణలో ముందస్తుగా మాక్‌డ్రిల్ నిర్వహించింది.

# తిరుపతిపై మళ్లీ తకరారు!
### పొత్తుతో టిడిపి సీనియర్లకు దక్కని చోటు -అసహనంలో పార్టీ కేడర్



ప్రభాతవార్త-తిరుపతి:
"రొట్టె కోసం రెండుపిల్లులు కొట్లాట కోతికి లాభమైనట్లు" తిరుపతి నియోజకవర్గంలో పట్టున్న తెలుగుదేశం పార్టీలో నాయకుల మధ్య ఆధిపత్య పోరు...చివరకు టిక్కెట్ జనసేనపార్టీకి కేటాయించే పరిస్థితులు దాపురించాయి. టిడిపి-బిజెపి-జనసేన పార్టీల మధ్య పొత్తులో భాగంగా తిరుపతిలో జనసేన తరపున పోటీ చేసే అభ్యర్థి ఎవరనే తేల్చలేక తకరారులో పెట్టారు. టిడిపి మొదటి విడత విడుదల చేసిన 94మంది జాబితాలోగానీ, తాజాగా గురువారం విడుదల చేసి 34మందిఅభ్యర్థుల జాబితాలోగానీ తిరుపతి టిక్కెట్ ఊసేలేక పోవడంతో టిడిపి శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోంది. పార్టీలో సీనియర్లకు టిక్కెట్ కేటాయించే పరిస్థితి అధినేత చంద్రబాబుకు సాధ్యపడలేదనే చెప్పు కుంటున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి స్థానాన్ని జనసేనకు కేటాయించారు. జనసేనతో పొత్తుతో తిరుపతి సీటు వదులుకోవాల్సిన దౌర్భాగ్యం టిడిపికి తప్ప లేదు. జనసేన తరపున తిరుపతిలో పోటీకిసరైన అభ్యర్థి లేకపోవడంతో చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్న ఆరణి శ్రీనివాసులు వైసిపిని వీడి జనసేనపార్టీ మారడంతో ఆయనకు కేటాయించాలనే ఆలోచనతో పవన్‌కల్యాణ్ ఉన్నారు. ఇంకా గంటా నరహరి కూడా పార్టీ కండువా వేసుకున్నారు. ఇద్దరిలో ఎవరికి తిరుపతి టిక్కెట్ ఇవ్వాలనే అంశం ఓ కొలిక్కి రాలేదు. మరోవైపు తిరుపతిలో టిడిపి ఇన్‌చార్జిగా ఉన్న మాజీఎమ్మెల్యేఎం.సుగుణమ్మ ప్రజల్లోమంచి పట్టుకలిగిఉందనే కొంతవరకు చెప్పుకోవచ్చు. ఈ దశలో అవసరమైతే జనసేనపార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారనేది ఆమె వర్గీయులు బాహాటంగా చెబుతున్నారు. ఇంటిపోరుతో సుగుణమ్మ అభ్యర్థిత్వం కోల్పోవాల్సి వచ్చిందనేది పరిశీలకుల వ్యాఖ్యలు.

## గూడూరు డివిజన్‌లో వైసిపి జోష్

వాకాడు, మార్చి 14, ప్రభాతవార్త
గూడూరు డివిజన్ వైకాపా శ్రేణుల్లో జోష్ నెలకొంది. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాకతో ఆ పార్టీ వర్గాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా ముందుకు కదిలాయి. జిల్లా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మంత్రి పెద్దిరెడ్డి రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటి వరకు ఎన్నికలకు సమయతమవుతున్న వైసిపి కార్యకర్తలను మంత్రి పెద్దిరెడ్డి ప్రసంగంతో ఉత్సాహ పరచడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో ముందుకు కదిలారు. ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నా ధీమాను ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వాకాడులో జరిగిన గూడూరు నియోజకవర్గ వైకాపా విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా పార్టీ నాయకత్వానికి మంత్రి పెద్ది రెడ్డి దిశ, నిర్దేశం చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులో రానున్న ఎన్నికలను ఎదుర్కొని విజయం సాధన దిశగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. రాష్ట్రంలో జగనన్న ఏర్పాటు చేసిన నాలుగు సిద్ధం సభలు దీటుగా వాకాడులో సభ పెట్టడం వేలాదిమంది వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు, ప్రజలు తరలి రావడం గర్వంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు ప్రజలు నమ్మె స్థితిలో లేరని, జగనన్న కొట్టే సూపర్ సిక్స్‌కి చంద్రబాబు, చంద్రబాబు దత్త పుత్రుడు, బిజెపి నాయకులు రాష్ట్రం నుండి పరుగులు తీస్తారన్నారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. వెంకటగిరి వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను వెంకటగిరి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసినా వాకాడు నా సొంత ఊరు మరునని, ముఖ్యంగా గూడూరు, సూళ్ళూరుపేట నియోజకవర్గాలు లీడర్లకు ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహావిష్కరణకు విచ్చేసిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

## యుద్ధానికి సిద్ధం - పసుపు సైన్యం...!
### చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో టిడిపి అభ్యర్థుల ఖరారు




సుధీర్‌రెడ్డి (శ్రీకాళహస్తి), లక్ష్మీసాయిప్రియ ( వెంకటగిరి)




నాని (చంద్రగిరి), ఆదిమూలం (సత్యవేడు)

( ప్రభాతవార్త న్యూస్ నెట్‌వర్క్ )
ఎట్టకేలకు తెలుగుదేశం కార్యకర్తల ఉత్కంఠకు తెరదించారు ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు. మొదటివిడత జాబితాలో సీట్లు దక్కనివారు తమకు సీటు దక్కుతుందో..లేదో అని నరాలుతెగే ఉత్కంఠతో ఎదురు చూస్తూ వచ్చారు. తిరుపతి జిల్లాలో తొలిజాబితాలో గూడూరు, సూళ్ళూరుపేట నియోజకర్గాలకు పాశం సునీల్ కుమార్, నెలవల జయశ్రీలపేర్లు మాత్రం ప్రకటించిన తెలుగుదేశం అధిష్టానం తాజా జాబితాలో శ్రీకాళహస్తినుంచి బొజ్జల సుధీర్‌రెడ్డిని, వెంకటగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ కుమార్తె,ప్రముఖ కాంట్రాక్టర్ గంగా ప్రసాద్ కోడలు కురుగుండ్ల లక్ష్మిసాయిప్రియను అభ్యర్థులుగా ప్రకటించారు. అలాగే సత్యవేడు స్థానానికి ఇటీవలే వైకాపాకు రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. చంద్రగిరి నుంచి పులివర్తి వెంకటమణిప్రసాద్ (పులివర్తినాని)ని అభ్యర్థిగా ప్రకటించారు. ఇక ప్రధానంగా తిరుపతికేంద్రాన్ని మిత్రపక్షం అయిన జనసేనకు కేటాయించింది. తిరుపతి మినహా జిల్లాలో తక్కిన ఆరు స్థానాలలో అభ్యర్థుల ఖరారు కావడంతో కార్యకర్తల్లో,నాయకుల్లో మంచి జోష్ కనిపిస్తోంది.

చిత్తూరు జిల్లా విషయానికి వస్తే తొలి జాబితాలో పార్టీ అధినేత నారాచంద్ర బాబునాయుడు కుప్పం నుంచి, మాజీ మంత్రి ఎన్.అమరనాథరెడ్డి పలమనేరు నుంచి, చిత్తూరు నుంచి గురజాల జగన్మోహన్, గంగాధరనెల్లూరు నుంచి డాక్టర్ థామస్, నగరి నుంచి గాలి భానుప్రకాష్ పేర్లను ప్రకటించారు.తాజా జాబితాలో పూతల పట్టునుంచి డాక్టర్ కలికిరి మురళీమోహన్, పుంగనూరు నుంచి చల్లా రామచంద్రారెడ్డి ( చల్లాబాబు)పేర్లను అధిష్టానం ఖరారు చేసింది.దీంతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ తెలుగుదేశం అభ్యర్థులుఖరారయ్యారు. అనేక రకాల వడపోతలు, సమీకరణల మధ్య ఐవిఆర్ఎస్ పద్ధతిలో ఒకటికి పలుమార్లు సర్వేలు చేశాక తెలుగుదేశం అధిష్టానం ఈ జాబితాను తయారుచేసినట్టు తెలుస్తోంది.




చల్లా బాబు (పుంగనూరు), మురళి (పూతలపట్టు)

## ఎన్నికల షెడ్యూల్ నాటికి సర్వం సిద్ధం
### - కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త:
ఎన్నికల షెడ్యూల్ జారీ నాటికి ఫ్లయింగ్, స్టాటిక్ సర్వైలెన్స్, ఎస్‌టి, తదితర టీమ్స్ సిద్ధంగా వుండాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యలతో కలిసి 2024 సార్వత్రిక ఎన్నికలు, వివిధ నోడల్ ఆఫీసర్ల నియామకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుండి ఫ్లయింగ్, స్టాటిక్ సర్వెలెన్స్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, రిస్పన్ మేనేజ్‌మెంట్ తదితర టీమ్‌లు సిద్ధంగా వుండాలన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వివిధ రకాల టీమ్స్‌ను సిద్ధం చేయాలన్నారు. అలాగే జిల్లాకు వచ్చే ఎన్నికల పరిశీలకులు, వివిధ రకాల టీమ్స్‌కు వాహనాలను సిద్ధంగా వుంచాలని డిటిసీని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎస్వీ సెట్‌లో ఏర్పాటు చేసే కౌంటింగ్ కేంద్రంలో బారికేడ్లు, వివిధ రకాల మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బి ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో క్లైయిమ్స్ అండ్ అబ్జెక్షన్ పెండింగ్ అంశాల క్లియరెన్స్ చేయాలని ఎఫ్ఎస్ఓను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్స్‌లు సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. అలాగే పోలింగ్ రోజు నిర్వర్తించాల్సిన బాధ్యతలను చిత్తూరు నగరంలోని రెండు కేంద్రాల్లో పిఓ, ఎపిఓలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు శివయ్య, భవానీలు, డిఇఓ దేవరాజులు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్‌రెడ్డి, డిటిసీ నిరంజన్‌రెడ్డి, సాంఘీక సంక్షేమ, సాధికారిత అధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డ్వామా పిడి రాజశేఖర్, డ్వామా ఎపిడి గంగాభవానీ, డిఎల్‌డిఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆగివున్న ఆర్టీసి బస్సును ఢీకొన్న కారు
### ఇద్దరు మృతి





చిల్లకూరు, మార్చి 14, ప్రభాతవార్త
తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం బూదనంటోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఆగిఉన్న ఆర్టీసి బస్సును ఓ కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు గిద్దలూరు నుండి చెన్నై వైపుగా వెళ్తున్న ఆర్టీసి బస్సు టైర్‌పంచర్ కావడంతో డ్రైవర్ బస్సును ఆపి వెనుక వైపు జాకీ కోసం వెళ్లి మరమ్మతులు చేస్తున్న క్రమంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందినకొందరు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు వెళ్తుండగా కారు అదుపు తప్పి ఆగిఉన్న ఆర్టీసి బస్సుని ఢీకొంది. ఆ సమయంలో ఆర్టీసి డ్రైవర్ దూదేకుల మలాన్‌షావల్లి (52) అక్క డికక్కడే మృతి చెందాడు. అదే విధంగా కారులో ఉన్న మారుశెట్టి సుదర్శన్ రావు (68)మృతి చెందాడు. పద్మావతి,అనురాధ, మేరు, రామచంద్రరావులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులనుఅంబులెన్స్ ద్వారా గూడూరు ఏరియా ఆసు పత్రికి తరలించారు. చిల్లకూరు ఎస్ఐ ఎం.అంజిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

## మొబైల్ హంట్ అప్లికేషన్‌తో మెరుగైన సేవలు
### భారీగా మొబైల్ ఫోన్లు రికవరీ
### ఫోన్లను బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పి కృష్ణకాంత్ పటేల్



తిరుపతి క్రైం, మార్చి 14, ప్రభాతవార్త
తిరుపతి జిల్లాలో సెల్‌ఫోను పోగొట్టుకున్న వారి కోసం ప్రత్యేకంగా తిరుపతి జిల్లా పోలీసు వారు ఫిబ్రవరి 2023లో మొబైల్ హంట్ అప్లికేషన్ సేవలను ఏర్పాటు చేశారు. తద్వారా వచ్చిన ఫిర్యా దులపై ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా సెల్ ఫోన్‌లను రికవరీ చేసి రూ. 4,73,40,000 విలువ చేసే సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు అందజేసారు. ప్రస్తుతం 9వ విడతలో నెల రోజుల వ్యవధిలోనే రికవరీ చేసిన 7200000 విలువ చేసే 400 మొబైల్ ఫోన్లను ఎస్పి కార్యాలయం నందు జరిగిన సమావేశంలో జిల్లా ఎస్పి కృష్ణకాంత్ పటేల్ వివరాలను వెల్లడించి బాధితులకు మొబైల్ ఫోన్‌ను అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఇప్పటి వరకు మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా 9 విడతలకు గాను మొత్తం రూ. 54540000 విలువ గల 3030 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ సెల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, సైబర్ క్రైమ్ సిబ్బందికి జిల్లా ఎస్పి కృష్ణకాంత్ పటేల్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పిలు అడ్మిన్ వెంకట్రావు, ఎస్బిడిఎస్పి భాస్కర్ రెడ్డి, సైబర్ క్రైమ్ సిఐ వినోద్ కుమార్, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అలిగిన వేళనే..చూడాలి..అమ్మవారినీ...





పల్లకిల్లో స్వామివారు, దేవేరి అద్దంలో చూసుకుంటున్న దృశ్యం

శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి గ్రామోత్సం పల్లకి సేవ. ఈ సేవకు గతంలో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. రాను రాను ఉత్సవాలు మొక్కుబడిగా ఊరేగింపులకే పరిమితమౌతున్న దశలో పల్లకి సేవ కూడా స్థానికులకే పరిమితమైంది. అయితే ఉత్సవాలను సమయపాలనతో ఈ ఏడాది నిర్వహించటంతో స్థానికులు అత్యధిక సంఖ్యలో దర్శించుకునే భాగ్యం లభించింది. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళా భక్తులు తండోపండాలుగా కదలి వచ్చారు.

**అలిగిన వేళనే చూడాలి . . .**

అలిగిన అమ్మవారిని బుజ్జగిస్తూ, ప్రాధేయపడుతూ వెంబడించిన సోమస్కందమూర్తి ఘట్టం భక్తులను ఎంతగానే ఆకట్టుకుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 12వ రోజు నిర్వహించే గ్రామోత్సవం పల్లకిసేవ. సాధారణంగా ఎవరైనా అలిగితే, కోపబడితే కళ్ళు ఎర్రబడడం సహజం. మోహం ఎర్రగా మారిపోతుంది. అయితే జగన్మాత అసురసంహారిని అయిన ఆదిశక్తి ఆగ్రహించిన వేళ ఆమెను చూడడం ఎవరికైనా సాధ్యమా? సాహసమా? అందుకే అలిగిన ఆదిశక్తి ముందు పల్లకిలో వెళ్ళగా ఆమెను బుజ్జగిస్తూ సోమస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుడు వెంబడించడం పల్లకి సేవ పరమార్థం. ఈ ఘట్టం రమణీయంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయం జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి కైలాసనాథుని పల్లకి ఉత్సవం వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని తిలకించుటకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. దాంతో నాల్గు రాడావీధుల్లో ఎటు చూసినా ఇసుకేస్తేరాలనంత రద్దీ ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం ఆలయంలోని అలంకార మండపంలో సోమాస్కందమూర్తి అయిన శ్రీకాళహస్తీశ్వరుని ఓ పల్లకిలో ముస్తాబు చేశారు. అలాగే మరో పల్లకిలో దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని చక్కగా అలంకరించి ప్రతిష్టించారు. స్వామి వారి పల్లకిలో అద్దం ఏర్పాటు చేశారు. ముందు స్వామి వారి పల్లకి వెళుతుండగా వెనుక అమ్మవారి పల్లకి సాగింది. అద్దంలో అమ్మవారి తేజస్సును దర్శించుకుంటూ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ రాజేష్, సూరిబాబులు ముస్తాబు చేయగా ఉత్సవాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేకాహ్వానితులు, ఆలయ ఇఓ ఎస్వి.నాగేశ్వరరావు, ఉత్సవాల పర్యవేక్షకులు హరియాదవ్, ఇఇ నూకారత్నం, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, డెప్యూటీ ఇఓ ఏకాంబరం, ఎఇఓ సతీష్‌మాలిక్, ధనపాల్, లోకేష్, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఉత్సవాల ఇన్‌చార్జి లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్సెపెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, నాగభూషనం యాదవ్ పర్యవేక్షించారు.

## సూర్యప్రభ వాహనంపై విహరించిన మొగిలీశ్వరుడు



బంగారుపాళ్యం, మార్చి 14 ప్రభాతవార్త:
మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మొగిలీశ్వరుడు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం వేకువ జామునే స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి మంగళవాయిద్యాలతో ఊరేగించారు. ఉభయదారులుగా నలగాంపల్లికి చెందిన కెఎన్ నరసింహులునాయుడు కుటుంబీకులు వ్యవహరించారు.

## అభివృద్ధి సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం
### - డిప్యుటీ సిఎం నారాయణస్వామి



ఎస్ఆర్‌పురం, మార్చి 14 ప్రభాతవార్త:
అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యుటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. డిప్యుటీ సిఎం నారాయణస్వామి గురువారం కొత్తపల్లి పంచాయతీ కొటార్లపల్లి వద్ద పాల శీతలీకరణ కేంద్రం, కొత్తపల్లి మిట్టలో వాటర్ ట్యాంకు, కొత్తపల్లికాలనీలో ఆరుమీటర్ల వెడల్పు రోడ్డును ప్రారంభించారు. కొత్తపల్లి కాలనీలో జరిగిన సమావేశంలో డిప్యుటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామం తనకు తల్లి లాంటి గ్రామమని, గత ఐదు సంవత్సరాలుగా తాను డిప్యుటీ సిఎంగా వుంటూ ఎలాంటి అవినీతికి పాల్పడలేదన్నారు. జరుగనున్న ఎన్నికల్లో తన కుమార్తె కృపాలక్ష్మిని గెలిపించాలని ఆయన కోరారు. జడ్పీటిసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపిడిఓ మోహన్‌మురళీ, ఎంపిపి సరిత, డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ ఢిల్లయ్య, ఎంపిటిసీ కోటిబాబు, మాజీ సర్పంచ్ విజయబాబు, సర్పంచ్‌లు దిలీప్‌రెడ్డి, మార్కొండయ్య, మణి, తదితరులు పాల్గొన్నారు.

### విజయం మాత్రమే
## మహిళ గొప్పతనాన్ని చెబుతుంది



పుత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త :
విజయం మాత్రమే ఒక మహిళ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెబుతుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కాలేజీలో రూ. 12.50 లక్షలతో నిర్మించిన డిజిటల్ సెమినార్ హాలును ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులకు రూ. 2.20 లక్షలు విలువ చేసే 20 కుట్టుమిషన్లను అందించారు. అనంతరం విద్యార్థినులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్య అందరికీ గుర్తింపునిస్తుందన్నారు. ఇంటర్ విద్య తర్వాత తాను సినీ పరిశ్రమలోకి వెళ్లడం వల్ల చదువుకోలేకపోయానని, అందుకే పేద పిల్లలైన పుష్ప, హమీద్‌లను మెడిసన్ చదివిస్తున్నానని తెలిపారు. ఒక మహిళపై నిందలు వేస్తున్నారంటే ఆ మహి ళ ఆ రంగంలో విజయం సాధిస్తోందని అర్థమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

**అక్కచెల్లెమ్మల భవిత మార్చిన జగనన్న**

రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల భవిత మార్చిన నాయకుడు జగనన్న అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన నాల్గో విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆమె పాల్గొని ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. పుత్తూరు మునిసిపాలిటీకి రూ 4.25 కోట్లు, రూరల్ మండలానికి రూ. 2.63 కోట్లు, వడమాలపేటకు రూ. 3.48 కోట్లు చొప్పున చేయూత చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైకాపాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బొక్కసంపాళ్లెంలో పోషక పక్వాడ

శ్రీకాళహస్తి రూరల్ మార్చి 14 ప్రభాతవార్త



మండలంలో బొక్కసంపాళ్లెం గ్రామంలో గురువారం సిడిపిఓ శాంతిదుర్గ ఆధ్వర్యంలో పోషక పక్వాడ కార్యక్ర మం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, బాలింతలకు గర్భవతులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పోషక పదార్దాలను సద్వినియోగంగా దుర్వినియోగం కాకుండా చూసుకోవాలన్నారు. సిల్లల పోషణ ఆరోగ్యం ముఖ్యమని ప్రతి తల్లితన బిడ్డను అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పిల్లల బరువులు, ఎత్తుళ్ళు చూసుకోని ఫోషణ స్దాయిలను తెలుసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేసిన వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేవతి, సిబ్బంది హాజరైయ్యారు.

## ఎంఎల్‌ఏచే పలు ప్రారంభోత్సవాలు

.తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త



నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్స వాల్లో ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత పెద్దకన్నలి సచివాలయం మరియు రైతు భరోసా కేంద్రం అనంతరం పొయ్య సచివాయం, రైతు భరోసా కేంద్రం, మరియు నూతన త్రాగునీటి పైపులైన్ ప్రారంభోత్స వం, అలాగే మల్లిగుంట అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏకు ఎంపిపి ఉన్నం నిర్మల, వైస్ ఎంపిపి మల్లికమ్మ, గరటారెడ్డి, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడులు ఎంఎల్‌ఏకు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎన్నడూ ముందుటానని తెలిపారు. మండలంలోని ప్రారంభోత్స వాల్లో ఎంఎల్‌ఏకు నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమాల్లో పిఏసిఎస్ ఛైర్మన్ మణిబాబునాయుడు, నాయకులు కన్నలి ప్రభాకర్‌రెడ్డి, కోవిచంద్రయ్యనాయుడు, సర్పంచ్ రమా, సక్కుబాయమ్మ, నాగేంద్ర, ఎంపిటిసిలు పద్మ, సచివాలయ కన్వీనర్లు మోహన్, నర్సింహులు, సునీల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రాఘవరెడ్డి, కందాటి రామచంద్రారెడ్డి, కన్నలినరసింహారెడ్డి, చిరంజీవి, మండల అధ్యక్షుడు శంకరయ్య, శోభన్‌నాయుడు, ఎంపిటిసి చెంచులక్ష్మి, మండల వైకాపా అధ్యక్షుడు శంకరయ్య, జగదీశ్వర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, శ్రీను, పెరుమాళ్‌రెడ్డి, వెంకట్రామానాయుడు, మునిరాజ, సుబ్రమణ్యం, మణి, వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పాలమురళీ, గోపినాయుడు, భద్రయ్య, బత్తెయ్య, ప్రకాష్, కన్నలిమధు, వెంకటయ్య, ఆనంద్, నెలవలిప్రసాద్, వెంకీ, రాజేంద్ర, మధురెడ్డి, గంగాధరం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తా చాటుదాం..!

### టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 14 ప్రభాతవార్త:

సాధారణ ఎన్నికలలో టిడిపి కార్యకర్తలు సత్తా చాటుదామని మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. గురువారం చంద్రగిరి నియోజకవర్గ అభ్యర్థిగా పులివర్తి నాని పేరును ఖరారు చేయడంతో నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో భాణా సంఛా పేల్చి స్వీట్లు తినిపించుకుంటూ సంబరాలు జరుపకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అభ్యర్థి పులివర్తి నానిని భారీ మెజీర్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలన్నారుటిడిపి నాయకులు జనార్ధన్ చౌదరి, కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్ర నాయుడు, కొట్టే నరశింహారెడ్డి, గిరిధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, ప్రసాద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల అభివృద్ధి చెవిరెడ్డితోనే సాధ్యం

### చెవిరెడ్డి జ్ఞానేష్ రెడ్డి

రామచంద్రాపురం, మార్చి 14 ప్రభాతవార్త:



పల్లెల అభివృద్ధి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితోనే సాధ్యమని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి జ్ఞానేష్ రెడ్డి అన్నారు. గురువారం అనుప్పల్లి సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధిపనులను ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుప్పల్లి సచివాలయ పరిధిలో రూ.3.19 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. సమావేశ మందిరాలు, గ్రంధాలయాలు, శ్మశాన వాటికల అభివృద్ధి, రచ్చబండల నిర్మాణం, సిమెంట్ బల్లలు, సిసి రోడ్లు, యోగాధ్యాన మందిరాలు, ఆర్ఓ ప్లాంట్లు వంటి అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి సంక్షేమం కొనసాగాలంటే తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎంఎల్‌ఏగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## పర్యావరణ సంరక్షణ, లింగ సమానత్వం దేశ సమగ్రాభివృద్ధికి మూలం

తిరుపతి మహిళావర్శిటీ, మార్చి 14, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం అధికారిని డా. నీరజ ఆధ్వర్యంలో కుంద్రపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవ శిబిరంలో భాగంగా గురువారం పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వ సాధన అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించే నిమిత్తమై, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారిని డా. నీరజ మాట్లాడుతూ పర్యావరణ సవాళ్లతో పాటుగా, లింగ ఆధారిత అసమానతలు దేశాభివృద్ధికి అడ్డంకులుగా ఉన్నాయని, వీటిని నిర్మూలించి, దేశ సమగ్రాభివృద్ధికి స్త్రీ పురుషులిరువురు భాగస్వామ్యులవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. స్కూలు విద్యార్ధినులకు జాతీయ గీతాలపైన, వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన కల్పించి, పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, సర్పంచ్ శుభా పద్మనాభం రెడ్డి, సెక్రటరీ మురళి, హెడ్మాస్టర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య శ్రీనివాసమూర్తికి ఫెలో అవార్డు

తిరుపతి క్రీడ, మార్చి 14, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వి. శ్రీ కాంత్ రెడ్డి చేతుల మీదుగా బయోకెమిస్ట్రీ ఆచార్యులు ఎం డిఎస్ మూర్తి ఫెలో అవార్డు తీసుకున్నారు. వారికి ఈఫెలో అవార్డును సొసైటీ ఆఫ్ అగ్రికల్చరల్ బయోకెమిస్ట్స్ లక్నో సంస్థ ద్వారా పొందారు. వ్యవసాయ క్షేత్ర సంబంధ పరిశోధనలకు 2023 సంవత్సరానికి ఈ అవార్డు వచ్చింది. కాగా ఆచార్య మూర్తి 32 సంవత్సరాల బోధనానుభవంతో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా పొందారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, రీసెర్చ్ డీన్ ఆచార్య విజయభాస్కర రావు పాల్గొన్నారు.

## ఏపిపియస్సీని చెరబట్టిన జగన్‌రెడ్డి : ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త

రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ప్రతి రంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న జగన్‌రెడ్డి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కూడా తన నియంతృత్వ దోరణితో చెరబడ్డారని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆరోపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులు తమ తమ ఉద్యోగ లక్ష్యాలను సాధించుకోవడానికి ఉపయోగపడే వేదిక అయిన ఏపిపియస్సీ లో కూడా తమ మార్కు అక్రమాలకు పాల్పడి అర్హులైన వారికి దక్కాల్సిన గ్రూప్–1 ఉద్యోగాలను కోట్లాది రూపాయలకు తనకు కావాల్సిన వారికి ఇప్పించుకున్న నిరుద్యోగ ద్రోహి జగన్‌రెడ్డి అని ఉమేష్ ఆరోపించారు. ఏపిపియస్సీ ద్వారా జరిగిన అన్ని నియామకాలుపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించి అక్రమార్కులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్బావ దినోత్సవం

శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త



జనసేన పార్టీ ఆవిర్బావ దినోత్స వం సందర్భంగా గురువారం జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్‌కట్‌చేసి హర్షద్వానాలు వ్యక్తం చేశారు. ఈసందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ జనసైనికులకు, జనసేన నాయకులకు, వీరమహిళలకు జనసేన పార్టీ ఆవిర్బావ దినోత్స వ శుభాకాంక్షలు తెలిపారు. అసాధ్యాలను సుసాధ్యం చేసుకుంటూ ముందుకు సాగడమే తక్షణ కర్తవ్యం అని నవశకానికి మనదైన ముద్రవేస్తూ సుపరిపాలనే ధ్యేయంగా రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజాశ్రేయస్సు కోసం జరిగే రేపటి ఎన్నికల తుదిపోరులో గెలుపు బాటకై రెట్టించిన ఉత్సాహంతో ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మల్లికార్జున్, రాజశేఖర్, ఫయాజ్, సురేష్, వెంకటేష్, నరసింహ, శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా శ్రేణుల్లో ఆనందం-టిడిపి భారీ ర్యాలీ

శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఎంఎల్ఏ అభ్యర్థిగా స్వర్గీయ బొజ్జలగోపాలకృష్ణారెడ్డి కుమారుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డిని తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రకటించడంతో తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తల్లో సంతోషం వ్యక్తం చేశారు. దీంతో సాయంత్రం ఏపీసీడ్స్ సర్కిల్ నుంచి బొజ్జలసుధీర్‌రెడ్డి, సతీమణి బొజ్జలరిషితారెడ్డిలతో పాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు, పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, పార్లమెంటు ప్రతినిధి రంగినేనిచెంచయ్యనాయుడు, కాసరం రమేష్, వజ్రంకిషోర్, నెమళ్ళూరుసుబ్రమణ్యం, సుబ్బయ్యలతో పాటు పలువురు తెదేపా కార్యకర్తలు, నాయకులు కలసి ద్విచక్రవాహనాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసినివాళులు అర్పించడంతోపాటు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి యాదవ సంఘం నాయకులు

వడమాలపేట, మార్చి 14 ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ జనరల్ సెక్రటరీ నగరి నియోజకవర్గ యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు గెడ్డం సుబ్రహ్మణ్యం యాదవ్ గురువారం తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరిని టీడీపీ నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి వెన్నుదన్నుగా ఉండేది బీసీలేనన్నారు. అందరూ కలసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, మణిరాజు, వెంకటయ్య, ధనంజయలునాయుడు, దాము యాదవ్, పెద్దబ్బరాజు, శేషాద్రి యాదవ్, హేమావతి, దేవా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

విజయపురం, మార్చి 14 ప్రభాతవార్త:

మండలంలో పాఠశాలల్లో గురువారం పాఠశాల వార్షికోత్స వం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పన్నూరు, శ్రీహరిపురం ఉన్నత పాఠశాలల్లో పాతార్కాడు ప్రాథమిక పాఠశాలల్లో వార్షికోత్స వం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాటలు, ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానకిరామరెడ్డి, సోమశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చేయూత చెక్కులు పంపిణీ

విజయపురం, మార్చి 14 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన విజయపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వాక్రా మహిళలకు గురువారం వైసీపీనాయకులు రాంప్రసాద్‌రెడ్డి చేయూత చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో 1927 మంది సభ్యులకు రూ.361 కోట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలోఎంపీడీవో బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, ఎంపీటీసీ రాజగోపాల్, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుప్పారెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు గోపినాథ్, మండల సమాఖ్య అధ్యక్షురాలువెంకటమ్మ, ఏపీఎంరమాదేవి, సీసీలు, నాయకులుశివరాజు, నారపరాజు, వెంకటేశులు, పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విజయపురం, మార్చి 14 ప్రభాతవార్త:



మండలంలోని విజయపురం ఎస్టీ కాలనీ, పాతార్కాడులో గురువారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, చిత్తూరు పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కపిల్, సర్పంచ్ బొబ్బిలి, నాయకులు అశోక్, జాన్, సత్య, నరసింహులు, భాగ్యరాజ్, శ్యాంవేలు పాల్గొన్నారు.

## సమిష్టిగా పనిచేద్దాం..తెలుగుదేశంను గెలిపిద్దాం

### –ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు, మార్చి14, ప్రభాతవార్త :



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ప్రస్తుత ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పోటీచేయనున్నట్లు గురువారం ఆపార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఈనేపధ్యంలో ఆదిమూలం గురువారం సాయంత్రం సత్యవేడు బేరిశెట్టి కళ్యాణ మండపంలో పార్టీ కీలకనేతలతో నియోజకవర్గ స్థాయి సమావేశంనిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిష్టిగా కృషి చేసి తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీలో అందరిని కలుపుకుని ముందుకు సాగుతామని చెప్పుకొచ్చారు. పార్టీలో ఎవరికైనా ఏవిధమైన సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరించుకుని పార్టీ గెలుపుకు కృషి చేస్తామన్నారు. వైకాపా పార్టీ దుర్మార్గమైన పార్టీగా పేర్కొన్న ఆయన సమయం వచ్చినపుడు వైకాపా పాలనలో సాగుతున్న పెద్దల అవినీతిని, దళితులపై సాగుతున్న దౌర్జన్యాలను మీడియాకు వివరిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే హేమలత, డాక్టర్ హెలెన్, జేడి రాజశేఖర్‌లతో మాట్లాడి వారిని కూడా కలుపుకుని పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

## శ్రీకాళహస్తితో కృష్ణదేవరాయల అనుబంధం విడదీయరానిది

### శ్రీకృష్ణ దేవరాయ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని రాజగోపురం ఎదురుగా గురువారం రాయలసీయను రతనాల సీమగా పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయాల కాంస్యవిగ్రహాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి ఆవిష్కరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిధిగా పాల్గొన్న శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో కృష్ణదేవరాయాల అనుబంధం విడదీయ రానిదన్నారు. ఆయన విజయయాత్రలో భాగంగా శ్రీకాళహస్తి వచ్చినపుడు ఆలయంలో నిర్మాణం పూర్తి కావటంతో 116కాళ్ళమండపాన్ని నిర్మించారు. విజయయాత్రకు గుర్తుగా ఆలయంలో ఏకశిల స్థంబాన్ని నిర్మించారని అలాగే ఆయన సోదరుడు అచ్చుత దేవరాయాల పట్టాభిషేకం శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిపించారన్నారు. అలాగే శ్రీకాళహస్తికి తలమానికంగా 139 అడుగుల ఎత్తులో 'రాజగోపురాన్ని' నిర్మించారన్నారు. అంతేకాక అనేక రాష్ట్రాలు దేశాల్లో దేవాలయాలు నిర్మించారని వివరించారు. అటువంటి మహనీయుని విగ్రహం ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయాల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుకు సహకరించిన నవయుగ కన్స్ట్రక్షన్స్ అధినేత చింతావిశ్వేశ్వరరావు అభినందనీయులన్నారు. ఎన్నికల కోడ్ వస్తుందనే భావంతో కార్యక్రమాలు హడావిడిగా ఏర్పాటు చేసామన్నారు. కాపు సమాజిక వర్గం తనకు ఎంతో సహకరిస్తుందన్నారు.

## శివయ్య సర్కిల్ ఏర్పాటు

శ్రీకాళహస్తి, మార్చి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం పట్టన నామధ్యేయాన్ని ఈ మార్గంలో పయనించే వారికి తెలిసేటట్టు ప్రస్తుత ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రణాళిక రూపకల్పన చేసి అమలు చేసారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి తిరుపతి మార్గంలోని ఎపి సీడ్స్ కూడలి వద్ద మళ్ళీ 'శివయ్య' సర్కిల్‌ను ఏర్పాటు చేసారు. గతంలో కూడా ఇక్కడ సర్కిల్ ఉండగా ఓ బస్సు డీకొంది. ధ్వంసమైంది. దాంతో ఇక్కడ అనుకూలం లేదని తీసివేసారు. అయితే ప్రస్తుతం మళ్ళీ సర్కిల్‌ను ఏర్పాటు చేసారు. ఇక్కడ ధ్యాన శివుని సర్కిల్‌లో ప్రతిష్టించి నామకరణం చేసారు. ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడుబియ్యపు మధుసూధనరెడ్డి ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ తాము ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆలోచనలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ శ్రీనివాసులు ఇఓ నాగేశ్వరరావు, ఇఇ నూకారత్నం, పట్టణ ప్రముఖులు సాధన మున్నారాయల్ ఆర్కాట్ కార్తిక్, బాలాగౌడ్, సునీల్, సుధీర్ వేదపండితులు ఆంజనేయ శర్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయం సాధ్యం

తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త



విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయాన్ని అందుకోవచ్చుని స్వెప్స్ స్వచ్ఛంద సంస్థ పథక సంచాలకులు డాక్టర్ ప్రమీలమ్మ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామగ్రిని పంపిణీచేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు దామోదరం అధ్యక్షత వహించారు. డాక్టర్ ప్రమీలమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను రాయాలన్నారు. కార్యక్రమంలో దామోదరం నాయుడు, మాధవయ్య, చంద్రశేఖర్, కృష్ణ, పట్టాభి, నాగేశ్వరనాయక్, సునీత, కనకదుర్గ, మహాలక్ష్మి, శివకుమార్, రాధారెడ్డి, సెల్వకుమార్, సంస్థ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్సోరా పరిశ్రమ కార్మికులకు యాజమాన్యం నోటీసులు

తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త

మండలంలోని రౌతుసూరమాల గ్రామ సమీపంలోని శాస్త్రి గిరిజన కాలనీ ఎదురుగా ఉన్న అక్సోరా రీసోర్సస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ కార్మికులకు యాజమాన్యం వేధింపులు తప్పడం లేదు. గత మూడు నెలల నుంచి వేతనాలు అందించలేదంటూ పనిచేస్తున్న కార్మికులు సుమారు 70 నిరసనకు దిగారు. పరిశ్రమలో శ్రీకాళహస్తి, బిఎన్‌కండ్రిగ, తొట్టంబేడు మండలాల నుంచే కాకుండా ఒరిస్సా తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. ఈపరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాల వల్ల మూగజీవాలు మృతిచెందుతుండడంతో పాటు కాలుష్యనియంత్రణ మండలి అధికారులు కూడా వచ్చి పరిశీలించిన విషయం విదితమే. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను గ్రామసమీపంలో ఎక్కడపడితే అక్కడ పడేయడంతో మూగజీవాలు మృతిచెందుతున్నాయి. పదిమంది చేయాల్సిన పనిని ముగ్గురు, నలుగురితో చేయిస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే పరిశ్రమలో అసలు ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి వెళ్ళిన పాత్రికేయులను కూడా యాజమాన్యం అనుమతించకపోవడం గమనార్హం. కార్మికుల చేత తమకు రావాల్సిన వేతన బకాయిలు, పిఎఫ్‌లు వెంటకనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే గురువారం కార్మికులకు యజమాన్యం నోటీసులు జారీచేసింది. యాజమాన్యం పనిచేస్తే చేయండి లేకపోతే కేసులు పెడుతామని బెదిరింపులకు గురిచేస్తున్నారని కార్మికులు పేర్కొన్నారు.

# తిరుపతి డివిజన్

## జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నగరి, మార్చి 14 ప్రభాతవార్త:** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్స వం సందర్భంగా నగరి నియోజకవర్గంలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన పార్టీ 11వ ఆవిర్భావ దినోత్స వ వేడుకలు నగరి మండల అధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ నగరి నియోజకవర్గ సమన్వయ కార్యకర్త మెరుపుల మహేష్, మండల అధ్యక్షులు ఉపేంద్ర, స్వామినాథన్, జగదీష్, మునిశేఖర్, వెంకటముని, శివలింగం, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రూరల్ బ్యాంకు అధ్యక్షులు సురేష్, చిత్తూరు జిల్లా టీఎన్‌టీయూసీ అధికార ప్రతినిధి జ్యోతినాయుడు, రమేష్, జనసేన పార్టీ మండల నాయకులు నవీన్, గిరి, రూపేష్, శివ, చిరంజీవి, కార్యకర్తలు హాజరయ్యారు.

## దీర్ఘకాలిక వ్యాధులకు సిద్ధ వైద్యం

వడమాలపేట, మార్చి 14 ప్రభాతవార్త:



దీర్ఘకాలిక వ్యాధులను సిద్ధ వైద్యంతో నయం చేయవచ్చునని తిరుపతి సిద్ధవైద్యం విభాగం వైద్యులు రాజ్యలక్ష్మి తమిళ సెల్వి పేర్కొన్నారు. గురువారం వడమాలపేట మండలంలోని పూడి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక సమస్యలైన మోకాళ్ళ నొప్పులు, రక్తపోటు, అస్మాతో ఇబ్బంది పడుతున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. చక్రపాణి, డా. శ్యాంరాజ్, సామాజిక ఆరోగ్యాధికారి పురుషోత్తంరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రమోహన్, ఏఎన్ఎం విజయ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## నేటమ్స్ షుగర్ బకాయిలు వెంటనే చెల్లించాలి

నింద్ర, మార్చి 14 ప్రభాతవార్త :

నేటమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతులకు చెల్లించవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని నేటమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతు సంఘ అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి డిమాండ్ చేసారు. గురువారం మండల కేంద్రంలో నేటమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతు నాయకులు సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు చెల్లించవలసిన బకాయిలు 36కోట్లు రుపాయిలు చెల్లించ కుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించినారు. రైతులకు చెల్లించవలసిన బకాయిలు గురించి రాష్ట్రంలోని అన్ని పార్టీలకు, నాయకులు తెలియపరిచిన వారి నుంచి ఏలాంటి స్పందన మాత్రం లేదని అన్నారు. రాబోవు 2024వ సంవత్సరం ఎన్నికలలో నేటమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతుల తరపున నగరి, సత్యవేడు నియోజకవర్గాలలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని రైతుల తరపున నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దీని వల్ల మాయొక్క సమస్య ప్రభుత్వానికి తెలియజేసినట్లు అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో రైతు నాయకులు శ్రీనివాసులు యాదవ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

పుత్తూరురూరల్, మార్చి 14 ప్రభాతవార్త:




కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకురావడం వల్ల రైతులను కడుపుకొట్టే చట్టాలను రద్దు చేయాలని గతంలో ఢిల్లీలో నడిబొడ్డులో ధర్నా నిర్వహించారు. అన్ని ప్రజా సంఘాలు వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున వారికి మద్దతుగా నిరసన తెలియజేశారు. ఈ మోదీ ప్రభుత్వం దిగివచ్చి ఆ నల్ల చట్టాలను రద్దుచేస్తామని హామీ ఇచ్చి దానిని అమలు చేయలేదని, రైతు సంఘాలు అదే విధంగా సీఐటీయూ వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే పుత్తూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మోదీ ప్రభుత్వం స్పందించి రైతు నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి హామీ ఇచ్చి రెండేళ్ల గడిపినా ఇంత వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. జనసేన, టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులు సుబ్రహ్మణ్యం, విజయ్, శివ, రమేష్, వెంకటేష్, హరీష్, దేవారెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రజలు ఎప్పుడూ వైసీపీ వైపే

### జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరించిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట, మార్చి 14 ప్రభాతవార్త:



ప్రజలు ఎప్పుడు వైసీపీ వైపుంటారని వచ్చే ఎన్నికల్లో వైసీపీని అఖండ మెజారిటీతో గెలిపిస్తారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యంలు అన్నారు. రేణిగుంట రమణ సర్కిల్ వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ఆవిష్కరణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు చేతుల మీదుగా గురువారం జరిగింది. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రారంభోత్స వాలు చేశారు. నడివీధి గంగమ్మస్థలం వద్ద, అన్నదాన సత్రం వీధి, మోడల్ అకాడమి స్కూలు సమీపంలో, ఎంపీడీవో ఆఫీస్ ప్రాంతాల్లో, అన్నసంపల్లి రోడ్డు వద్ద సీసీ రోడ్లు, ఎంపీడీవో కార్యాలయం వద్ద షెల్టర్, నాగార్జున పబ్లిక్ స్కూలు వద్ద 60 లక్షల వ్యయంతో నిర్మించిన అండర్ డ్రైనేజీ కాలువ, గణేష్ నగర్ న్యూ కాలనీలో ఓపెన్ డ్రైన్, మంచినీళ్ళగుంట వద్ద పార్కు, వాకింగ్ ట్రాక్ ప్రారంభోత్స వాలు చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చేయూత చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని పార్టీలు ఏకమైనా జగన్‌ని ఓడించలేరన్నారు. ప్రజాబలం ఉన్న నాయకుడిగా జగన్‌ని అభిమానించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, మండల అధ్యక్షుడు డా. గంగారి రమేష్, పట్టణ వైసీపీ అధ్యక్షుడు ప్రభాకర్, కో–ఆప్షన్ మెంబరు అసన్, రేణిగుంట సర్పంచ్ నగేష్, తిరుపతి జిల్లా వైసీపీ మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ మహ్మద్ రసూల్, మండల వైసీపీ మైనారిటీ ప్రెసిడెంట్ ఖాదర్, టౌన్ వైసీపీ మైనారిటీ ప్రెసిడెంట్ రఫీ ఉల్లా, విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆచారి శీను, మాజ ఎంపీటీసీ నాగరాజు, మురళీమోహన్ దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, హరిరెడ్డి, మన్యం శ్రీనివాసురెడ్డి, వెంకటరమణ, డా. గౌరి, షబ్బీర్, రాజేంద్ర, అప్పరెడ్డి, జాన్ బాబు, షరీఫ్, సుందర్ మూర్తి, మిథున్, జగన్, ఈశ్వరి, జగన్మోహన్, రిజ్వాన్, మస్తాన్, ఇంద్రాణి, ఉప్పు, రమణ, మల్లి, ఇరానీ, ఖాదర్, మహబూబ్ బాషా, అబ్దుల్ ఖాదిర్, మెస్ బాబు, జగదీశ్వరి, కృష్ణమూర్తి, చైతన్య, ఒడ్డి మిట్ట రమణ, శ్రీకాంత్, మణి, సూరి, చిన్న, షాజహాన్, శ్రీనివాసులు, బీసీ సంరక్షణ సమితి అధ్యక్షులు అక్కెనపల్లి లక్ష్మయ్య, అధ్యక్షులు పూల శ్రీనివాస యాదవ్, నక్క భాస్కర్‌యాదవ్, శీను ఆచారి, నాయకులు, వేలా యుధం, సుబ్రహ్మణ్యంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య

**రేణిగుంట, మార్చి 14 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం కరకంబాడి వద్ద రైల్వే ట్రాక్‌పై వంశీ అనే యువకుడు కదులుతున్న రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ రవి కథనం మేరకు.. తిరుపతి తుమ్మలగుంటకు చెందిన వంశీ కదులుతున్న గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గూడ్స్ లోకో పైలట్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## మూత్ర పిండాలు శరీరంలో ప్రధాన భాగాలు - డా. శివపార్వతి

రేణిగుంట, మార్చి 14 ప్రభాతవార్త:

మానవ శరీరంలో మూత్ర పిండాలు అతి ముఖ్యమైన భాగాలని అమర ఆస్పత్రి మూత్రపిండ వైద్యనిపుణులురాలు డా. శివపార్వతి అన్నారు. రేణిగుంట మండలం



కరకంబాడి అమర ఆస్పత్రిలో ప్రపంచ మూత్ర పిండాల దినోత్స వం సందర్భంగా గురువారం కిడ్నీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డా. శివపార్వతి మాట్లాడుతూ మూత్ర పిండ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. మూత్ర పిండాలకు వ్యాధులు సోకితే బతకడం కష్టమన్నారు. ముందుగానే వ్యాధులను గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. తరచు రక్తంలో క్రియాటిన్ టెస్టులు చేయించుకోవాలన్నారు. క్రియాటినైన్ లెవెల్స్ పెరగకుండా ఆహారపు అలవాట్లను మార్చుకుని వ్యాయామం చేయాలన్నారు. ఎక్కువగా నీరు తాగుతూ, షుగర్, బీపీలను అదుపులో ఉంచుకోవాలన్నారు. అందుకు సంబంధించిన ప్యాకేజీలను డా. శివపార్వతి, డా.మనోజ్, చీఫ్‌అడ్మినిస్ట్రేషన్‌ఆఫీసర్‌వేణుగోపాల్, మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు ప్రారం భించారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రేణిగుంట, మార్చి 14 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం విప్పమానుపట్టెడ వేమాపురం సంజీవరెడ్డి కాలనీ సచివాలయంలో పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా సొసైటీ ఫౌండర్, సర్పంచ్ లక్ష్మిపతిరెడ్డి గురువారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేసర్లు, షాపుర్లు, జామెంట్రీ బాక్సులు అందజేశారు.

## తిరుచానూరు పంచాయితీకి 2 కోట్ల 89 లక్షలు ఆదాయం

తిరుచానూరు, మార్చి 14, ప్రభాతవార్త:తిరుపతి గ్రామ మండలం తిరుచానూరు పంచాయితీకి టూరిస్ట్ బస్టాండు పార్కింగ్ టెండర్ ద్వారా 2 కోట్ల 89 లక్షలు ఆదాయం సమకూరినట్లు డియల్ పిఓ రూపారాణి తెలియజేసారు. బుధవారం పార్కింగ్ టెండరును పంచాయితీ ఆవరణలో డియల్‌పిఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కారు వారి పాట 2.80కోట్లు నిర్ణయించగా ధరణి అండ్ కో 2.89 కోట్లతో టెండరును దక్కించుకున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 34 లక్షల రూపాయిలు అధికంగా పంచాయితీకి లాభం కలిగినట్లు ఆమె తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి గిరిధర్ రెడ్డి, పంచాయితీ ఈఓ శివశంకర్ రాజు, పలువురు గుత్తేదారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చూడండి, ఆదరించండి : రోజా



నగరి, మార్చి 14 ప్రభాతవార్త: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూడండి వైసీపీని ఆదరించండి అని మంత్రి రోజా అన్నారు. గురువారం మండలంలోని అడవికొత్తూరులో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, తుడానిధులు రూ.20 లక్షలతో నిర్మించిన కాలువను ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్డుకు ఆమె భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్క అడవి కొత్తూరు సచివాలయ పరిధిలోనే డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.14.76 కోట్లు అభివృద్ధి పనులుజరిగాయన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు, ప్రజాప్రతి నిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి**

నింద్ర: గ్రామాభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పర్యాట కశాఖా మంత్రి ఆర్కె రోజా అన్నారు.గురువారం నింద్రలో జిమ్ నిర్మాణానికి ఆమె భూమిపూజ చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 తరు వాత దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామాలలో సచివాలయం, ఆర్‌బికె భవనాలు, వెల్‌నెస్ భవనాలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందన్నారు. ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలంధర్ రాజు, యంపిడిఒ భవాని,మండల వైకాపా కన్వీనర్‌వేణురాజు, వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్ లాల్, సచివాలయ వైకాపా కన్వీనర్‌బాబురెడ్డి, వైస్‌యంపిపి శుభరామ్,కో ఆప్షన్ మెంబరు అనిల్, సింగి ల్‌విండో ఛైర్మన్ మునిక్రిష్ణారెడ్డి, ఎపియం చంద్రకళ,యంపిటిసివిజేష్ నాయకులు దామోదరం, తోయజాక్షి రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, మేరీ జయరామ్, వీరయ్య నాయుడు, దినకర్, నామదేవరెడ్డి, సుధాకర్, వెంకటేశులు,సెల్వం పాల్గొన్నారు.

**అభివృద్ధిచూపే ఓటు అడుగుతాం**

సంక్షేమం,అభివృద్ధి చూపే ఓటరు వద్దకు వెళతామని మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు.గురువారం నింద్రలో నేను సిద్ధం నాబూత్ సిద్ధం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ రాబోవు ఎన్నికలలో ప్రతి ఒక్కరు పట్టుదలతో పని చేసి వైఎస్ఆర్ కాంగ్రెసును గెలిపించుకోవలసిన అవసరం వుందన్నారు. గత ఐదేళ్ళుగా నియోజకవర్గంలో అనేక సంక్షేమ,అభివృద్ధితో పాటు వ్యక్తిగతంగా పనులు చేస్తున్నాని తెలిపారు.

## శివయ్య సేవలో సుధీర్ పూజలు



శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త : మహిమాన్వితమైన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలను గురువారం తెలుగుదేశం శాసనసభ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి కుటుంబ సమేతంగా జరిపించుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన కుటుంబసమేతంగా ఆలయం వద్దకు రాగా ఆయనకు తెలుగుదేశం శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఆలయంలో నిర్వహించే ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజలను జరిపించుకున్నారు. తరువాత స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.ఆయనకు ఏర్పాట్లును పట్టణ పార్టీకి చెందిన కాసరం రమేష్, మాజీ జడ్‌పిటిసిలు వెంకటాచలం,ధనంజయులునాయుడు,జడ్‌పిటిసి వెంకట సుబ్బారెడ్డి మాజీ మార్కెట్ కమిటి ఛైర్మెన్ చెంచయ్యానాయుడు,నియోజకవర్గ బిసి నాయకులు పోలూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి,పేరం నాగరాజు నాయుడు,కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

## జాతీయ సైన్స్ సదస్సుకు కమ్మపల్లి విద్యార్థిని వాణి



రామచంద్రాపురం, మార్చి 14 ప్రభాతవార్త: కమ్మపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.వాణి జాతీయ సైన్స్ సదస్సుకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ జె.కామేశ్వరీ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థిని వాణి పలమనేరులోని మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 11 నుండి 13 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కోకోనట్ డ్రిల్లర్ అండ్ బ్రేకర్ సహాయంతో కొబ్బరి బోండాలకు సులభంగా రంధ్రం చేయు నమూనాను రూపొందించి ప్రదర్శించినట్లు తెలిపారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ సైన్స్ సదస్సులో ఆమె పాల్గొంటారన్నారు. వాణినీ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

## తేనెటీగల పెంపకంపై రాష్ట్రస్థాయి సెమినార్



తిరుపతిరూరల్, మార్చి 14 ప్రభాతవార్త: తేనెటీగల పెంపకంపై రాష్ట్రస్థాయి సెమినార్‌ను గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రారంభించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నేషనల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి సెమినార్‌ను నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ తేనె యొక్క ఉపయోగాలు, ఔషధ గుణాలు, తేనెటీగల పెంపకం ద్వారా తయారయ్యే వివిధ ఉత్పత్తుల గురించి వివరించారు. తేనెటీగల పెంపకం శ్రమతో కూడుకున్నది కాబట్టి, ఇందులో అప్రమత్తత లేకపోతే నష్టాలు చవి చూడాల్సి వస్తుందన్నారు. ఈ సెమినార్‌కు ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తేనెటీగల పెంపకంలో మెలకువలను తెలుసుకుని, తేనె ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకుని అధిక లాభాలను గడించాలని సూచించారు. చీని, నిమ్మ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.నాగరాజు మాట్లాడుతూ నాణ్యమైన తేనెను తయారు చేసి, ప్రభుత్వం ద్వారా ధ్రువీకరణ పొందడం వలన అధిక రాబడి పొందవచ్చునని తెలిపారు. హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తేనె ఉత్పత్తిలో కుషి చేయడమే కాక రైతాంగం, రైతు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసుకుని సన్నకారు వ్యాపారస్తులతో సంధి కుదుర్చుకోవడం ద్వారా తమ ఉత్పత్తిని అధిక ధరలకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. ఆర్ ఏ ఆర్ ఎస్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధాకర్ మాట్లాడుతూ కేవలం తేనె తయారీ కాకుండా ఉప్పొడి తేనెటీగల నుంచి వచ్చే మైనపు యొక్క ఉత్పత్తులు, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతుల సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఈ సదస్సు ద్వారా తేనెటీగల పెంపకంలోని సాధక బాధకాలు, లాభనష్టాల గురించి అవగాహన తెచ్చుకుని ఆ తర్వాత తేనెటీగల పెంపకాన్ని ప్రాంభించాలని కోరారు. బెంగళూరు జీవికె వ్యవసాయ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ టిఎన్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య మార్కెట్లో తేనె, తేనె ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించుట, వాటిని వినియోగదారులకు అందుబాటులో ఉంచుటకు మార్కెటింగ్ అవకాశాలు గురించి వివరించారు. వెలుగు రమేష్, కోటేశ్వరరావు ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, **KANKACHARLA RAJI** (old Name) R/o, 15-1-10, G.Car Street, Tirupati Gidst.A.P. My husband passport No.69908987, I have changed my name to (New Name) **KANIKACHERLA RANI** W/o Kanikacherla Hema Kumari.

I, **KANAKACHERLA HEMAKUMAR** (old Name) R/o, 15-1-10, G.Car Street, Tirupati Gidst.A.P. My passport No.G9908982, I have changed my name to (New Name) **KANIKACHERLA HEMA KUMAR** S/o Kanikacherla Suryaprakash Rao.

I, **DOMMARAPATI LATHA** W/o Dommarapati Nagaraj (Old Name) R/at D.No.2-62, Kandulavaripalli (V), Seshapuram (P), Chandragiri (M), Tirupati Dist. A.P. I have changed my naem to **DOMMALAPATI LATHA** W/o Dommalapati Nagaraju (New Name)

I, **RAMIREDDI VISWANATHA REDDY** (Old Name) R/at D.No.4-10-203-1, Prashanthi nagar, Pulivendula, YSR Dist.AP. I have changed my name to **RAMIREDDY VISWANATHA REDDY** S/o Ramireddy Pulla Reddy (New Name)






**KUPPAM MUNICIPALITY**

**'e' procurement Tender Notice**

Roc.No.1827/2023/E1, Dt: 13.03.2024

Tender Notice No.1827/2023/AE, Dt:13.03.2024

| | |
|---|---|
| **1. No.of works** | **: 3 No's** |
| **2. T.S.Amount/E.C.V.amount** | **: 41.80 lakhs** |
| **3. Bid Document Downloading Start Date** | **: 13.03.2024 at11.00am** |
| **4. Bid Document Downloading End Date** | **: 18.03.2024 at 3pm** |
| **5. Bid Document Submission Closing Date** | **: 18.03.2024 at 3.30pm** |
| **6. Price Bid Opening Date** | **: 18.03.2024 at 3.31pm** |
| **7. Name & Address of the Concerned Officer** | **: Commissioner, Kuppam Municipality, Kuppam-517 425, Cell: 9849901049** |

Further details can be seen @ 'e'procurement market place at https://tender.apeprocurement.gov.in form 13.03.2024 at 11.00 am

**Sd/- Commissioner,**
**Kuppam Municipality**





## తెలుగుదేశం అభ్యర్థినిగా లక్ష్మీసాయి ప్రియ



వెంకటగిరి, మార్చి 14, ప్రభాతవార్త : వెంకటగిరి తెలుగుదేశంఅభ్యర్థినిగా మాజీఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మిసాయి ప్రియను ప్రకటించారు. వెంకటగిరి తెలుగుదేశం టిక్కెట్ కోసం ముగ్గురు హేమాహేమీలు తలపడగావారిలో వైకాపా నుంచి తెలుగుదేశం లోకి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డితోపాటు,మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ, బి.సినాయకుడు మస్తాన్ యాదవ్‌లు తీవ్రంగా టిక్కెట్ కోసం యత్నించారు. వీరిలో జిల్లావ్యాప్తంగామంచి పేరు,ప్రతిష్టలు వున్న మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని అధిష్టానం ఒప్పించి ఆత్మకూరు అభ్యర్థిగా బరిలో దింపింది. ఇక మిగిలిన ఇద్దరిలో రామకృష్ణకు బదులు ఆయన కుమార్తె లక్ష్మిసాయిప్రియను అభ్యర్థిగా ప్రకటించారు.

– వెంకటగిరి టిడిపి అభ్యర్థి లక్ష్మి.

లక్ష్మి సాయి ప్రియ 1994 ఫిబ్రవరి 8న జన్మించారు. చెన్నైలో ఇంటర్మీడియట్ తోపాటు, బిబిఏ పూర్తి చేశారు,లండన్‌లో ఎంఎస్సీ చదివిన ఆమె ప్రముఖ కాంట్రాక్టర్ కొండేపాటి గంగాప్రసాద్ కుమారుడు కొండేపాటి శ్రీనివాస్‌తేజను వివాహం చేసుకుంది. లక్ష్మిసాయిప్రియ తనతండ్రి కురుగుండ్ల రామకృష్ణ గత ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలుగుదేశం యువనేత నారా లోకేష్ నిర్వహించిన యువగళం కార్యక్రమంలో ఆమెచురుగ్గా పాల్గొన్నారు.

## టిడిపి అభ్యర్థిగా ఆదిమూలం ఎంపికపై సంబరాలు



నారాయణవనం, మార్చి 14 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం ప్రకటించడంతో నారాయణవనం మండలంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకొన్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి డాక్టర్ బిఆర్ అంబేద్కర్, స్వర్గీయ నందమూరి ఎన్టీఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి అనంతరం పూల మాల వేసి వారికి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి టి.గోవింద స్వామి, మాజీ సర్పంచ్ శంకరయ్య, వెంకటేష్, సర్పంచ్ బి.మురుగేశన్, నాయకులు గోవిందశెట్టి, బిసీ శేఖర్, ఆలీబాయ్, కీలగరం నాగరాజు, షణ్ముగం మొదలియార్, ముఖేష్, పడవేటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుంగనూరులో పార్టీవైభవాన్ని పునఃప్రతిష్టచేస్తాం

**-దేశం అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి**



పుంగనూరు,మార్చి 14 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీకు కంచుకోటగా నిలిచిన పుంగనూరు నియోజకవర్గంలో పార్టీకు పూర్వవైభవం తీసుకువస్తామని, కుట్ర రాజకీయ చరిత్రను తిరగరాస్తామని తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా ప్రకటించబడిన చల్లా రామ చంద్రారెడ్డి అన్నారు. గురువారం పార్టీ అధిష్టానం ఆయనపేరను ప్రకటించింది. నియోజకవర్గానికి చెందిన చల్లా రామచంద్రారెడ్డి ఏడాదిగా పుంగనూరులో పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. ఈమేరకు ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ స్థానిక రాజకీయాలకు ప్రాధాన్యతిచ్చే పుంగనూరు ప్రజలు ఎంతో శాంతి కాముకులన్నారు. ఈనియోజకవర్గం నుంచి గెలిచి గతంలో చరిత్ర సృష్టించిన నేతలెందరినో ఆదర్శంగా ముందుకు సాగుతామన్నారు. తన అభ్యర్థితత్వంపై నమ్మకంతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తన పేరు ఎపుడో ప్రకటించారన్నారు. తాను నియోజకవర్గం మొత్తం పర్యటనలు చేశానని, ప్రజలను ఆదరించడం ఈనియోజకవర్గంలో తెలుగుదేశం నాయకుల నుంచినే ప్రారంభమైందని వాఖ్యానించారు. ఈసందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బాణసంచా,టపాకాయలు పేల్చి దేశం నాయకులు,కార్యకర్తలు సంబరాలు నిర్వహించుకున్నారు.

## పుంగనూరులో చీరల లొల్లి..!!



పుంగనూరు,మార్చి 14, ప్రభాతవార్త : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో రెండు రోజులుగా సాగుతున్న వాలంటీర్ల చీరల పంపిణీపై బిసివై పార్టీ నాయకులు భగ్గుమన్నారు. ఈమేరకు బిసివై నేత బోడె రామచంద్రయాదవ్ మాట్లాడుతూ తాము గతేడాది రథసప్తమి రోజున నియోజకవర్గంలోని మహిళలకు ఇవ్వాలని తీసుకువచ్చిన చీరలను అడ్డుకుని,అందులో అక్రమ మద్యం బాటిళ్ళు ఉంచి తమపై కేసులు పెట్టారన్నారు. ఇపుడు అదే చీరలను మంత్రి ఆదేశాలతో సచివాలయ వాలంటీర్లు నియోజకవర్గమంతా పంచుతున్నారని వాఖ్యానించారు. ఇదే విధంగా తమ కార్యకర్తలకు ఇవ్వాలని తెప్పించిన గోడగడియారాలను అక్రమమద్యం సాకుతో అడ్డగించారన్నారు. నేడో,రేపో ఇవి కూడా వైకాపా వాలంటీర్ల ఇండ్లలో దర్శనం కావచ్చున్నారు. తాము మహిళల కోసం ఏడాది కిందట తెప్పించిన చీరలకు కొనుగోలు చేసిన బిల్లులు,రవాణా బిల్లులు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి తమ చీరలను వైకాపా నాయకుల పరం చేశారని, తమకు చెందిన చీరలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. సీనియర్ నాయకులు చనకంటి సాంబమూర్తి మాట్లాడుతూ ఇటువంటి విషయాలన్నింటిని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల హృదయాలలో తాము ఉన్నామన్నారు. సీనియర్ నాయకుడు ఆర్.హరినాధరెడ్డి మాట్లాడుతూ చీరలు తమవేనని వైకాపా వారు రాజనాల బండలో ప్రమాణం చేసేందుకు సిద్దమేనా అని ప్రశ్నించారు. ఆనంద,తదితరులు ప్రసంగించారు.

## ఘనంగా జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం



పలమనేరు,మార్చి 14,ప్రభాతవార్త: పలమనేరు పట్టణంలో గురువారం జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.పట్టణంలో జనసైనికులు భారీ సంఖ్యలో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక టిడిపి కార్యలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిధిగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి హాజరు కావడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాన్ ఆలోచనలు గానీ ఆయనలో ఉన్న పట్టుదల,రాజకీయాల పట్ల ఉన్న నిబద్ధత ఎంతో గొప్పగా ఉంటుందన్నారు.ఆయన ఏమి ఆశించి రాజకీయాలు చేయడం లేదని ప్రజల భవిష్యత్తు కోసం ఆయన ఎప్పుడు ఆలోచిస్తుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్త,జనసేన నాయకులు డికే.చైతన్య, నియోజకవర్గ నాయకులు పూల చైతూ,రూపేష్,అరుణ్,హరీష్,చందు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ప్రచార రథాలు ప్రారంభించిన ఎమ్మెల్సీ

**- ఎల్ఇడి డిస్‌ప్లేతో ఆకర్షణీయంగా ప్రచార రథాలు !!**

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త : త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం నిర్వహించేందుకు కొత్త ప్రచార రథాలు వచ్చాయి. వీటికి గురువారం పూజలు నిర్వహించి ఎమ్మెల్సీ,సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ డా॥ కంచర్ల స్వయంగా ప్రచార రథాన్ని కొంతసేపు పట్టణంలో నడిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఈసారి తెదేపా అధినేత చంద్రబాబు నాయుడుకు లక్ష ఓట్ల మెజార్టీ సాధనే ధ్యేయ ంగా పనిచేస్తున్నామన్నారు. కుప్పం మున్సిపల్, కుప్పం రూరల్, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం మండలాలకు ఈ ఐదు ప్రచార రథాలను కేటాయిస్తామన్నారు. ఎల్ఇడి డిస్‌ప్లే, చంద్రబాబు చిత్రాలు, పాటలతో ఈ ప్రచార రథాలు ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. కార్యక్రమాల్లో కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా,చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయ, నేతలు సర్దార్, అన్సర్, డీలర్ వెంకటేష్, చెక్కునత్తం మణి, సంతోష్, బాలు, విష్ణు, చాంద్, మునాఫ్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ ఫలితాల్లో జిల్లా ఫస్ట్‌గా వుండాలి

**- జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు**



బంగారుపాళ్యం, మార్చి 14 ప్రభాతవార్త: మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షల్లో చిత్తూరు జిల్లా విద్యార్థులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో వుండాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు పిలుపునిచ్చారు. బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం డిఇఒ దేవరాజులు అకస్మికంగా తనిఖీ చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, జగనన్న గోరుముద్ద, విద్యార్థులకు విద్యాబోధన తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం డిఇఒ ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పాఠశాల నుండి టెన్త్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల గురించి హెడ్మాస్టర్ రాజేంద్రను అడిగి తెలుసుకొన్నారు. టెన్త్ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగు వసతులు కల్పించాలన్నారు. పరీక్ష రాసే టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారి పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పేద కుటుంబీకులని ఉపాధ్యాయులు గుర్తించాలన్నారు. టెన్త్ విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో చిత్తూరు జిల్లా టెన్త్ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఇఒ నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లక్ష రూపాయల విలువ చేసే కర్ణాటక మద్యం సీజ్

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త : జిల్లా సెబ్ డిఎస్ఇఒ సుబ్బరాజు ఆదేశాలతో జిల్లా సెబ్ ఎఇఎస్ రవి అధ్వర్యంలో లక్ష రూపాయల విలువ చేసే అక్రమ కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసినట్లు కుప్పం సెబ్ సిఐ సృజన్‌బాబు తెలిపారు. కుప్పం – కెంపాపురం మార్గంలో గుడికొత్తూరు వద్ద వాహనాలు తనిఖీ చేసు_ండగా టాటా ఇండికా కారు (టిఎన్22ఎడి8672) వేగంగా వచ్చి తమను చూసి కారులో ఉన్న వారు వేగంగా ముందుకు దూసుకెళ్లారన్నారు. కారును తాము ఛేజ్ చేస్తుండగా నిందితులు కారును వదిలేసి పారిపోయారన్నారు. కారును తనిఖీ చేయగా 1440 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు 259. 2లీటర్ల మేర పట్టుబడిందన్నారు. దీని విలువ లక్ష రూపాయలు అన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కారుతో సహా మద్యాన్ని సీజ్ చేశామన్నారు.ఈ ఛేదనలో చురుగ్గా వ్యవహరించిన సిబ్బంది ఉమా మహేష్, దేవేం ద్రలకు సెబ్ ఎఇఎస్ రవి క్యాష్ రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై అన్వేష్, హెచ్‌సిలు నాగరాజు, శ్రీనివాసులు, సిబ్బంది మధు, రఘు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే,ఎంపిగా మమ్మల్ని ఆదరించండి : మంత్రి పెద్దిరెడ్డి



పుంగనూరు,మార్చి 14 ప్రభాతవార్త : రానున్న ఎన్నికలలో పుంగనూరు శాసనసభ్యునిగా తనను, రాజంపేట ఎంపిగా మిధున్‌ను, ఆదరించాలని మంత్రి పెద్దిరెడ్డి విజ్ఞప్తిచేశారు. గురువారం ఉదయం హనుమంతరాయదిన్నె గ్రామంలో ఆంజనేయస్వామివారి పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గం 30 ఏళ్ళు నిర్లక్ష్యానికి గురైందని, అంత నష్టాన్ని తాము ఐదేళ్ళలో పూర్తిచేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సాయంతోనే పుంగనూరుకు అనేక సదు పాయాలు తీసుకువచ్చామన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి మూడు రిజర్వాయర్లు తీసుకువచ్చమని, వచ్చే ఏడాదిలోగా ప్రతి ఇంటికి కుళాయి అందచేస్తామన్నారు. కార్యక్రమాలలో ఎంపి రెడ్డెప్ప,వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కల్యాణకట్టలో వదలివెళ్ళిన నగలు అప్పగింత



తిరుమల,మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి: తలనీలాలు సమర్పించేందుకు కల్యాణకట్టకు వచ్చిన ఓ భక్తుడు బంగారుగొలుసు వదలివెళ్ళడం, దాన్ని గమనించిన ఉద్యోగి వంకీపురం పవన్ భక్తులకు అప్పగించేలా చూడటం జరిగింది. తిరుమల విఎస్ఒ నందకిశోర్ వివరాల మేరకు.. తిరుమలలో మాదవనిలయం వద్ద కల్యాణకట్టలో ఓ భక్తుడు తలనీలాలు సమర్పించేందుకు వచ్చాడు. ఆ సమయంలో క్షురకులు అతని తలనీలాలు తీశారు. గుండు శుభ్రం చేసుకునే సమయంలో సుమారు 2లక్షలు రూపాయలు విలువైన బంగారుగొలుసును పోగొట్టుకున్నాడు. దీన్ని గమనించిన కల్యాణకట్ట సంఘం ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్ గోలుసును ఏవిఎస్ఒ శైలేందర్ తో కలసి విఎస్ఒ నందకిశోర్‌కు తెలిపారు.ఆయన ప్రసారమాధ్యమాల్లో ప్రకటన చేసి భక్తుడి ఆనవాళ్ళు తెలుసుకుని బంగారుగోలుసును అప్పగించారు. ఆనందం చెందిన భక్తుడు టిటిడి విజిలెన్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

## దేశంలో తొలగిన ఉత్కంఠత: బొజ్జల సుధీర్‌రెడ్డికే అవకాశం



శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీలో 'టిక్కెట్టు ఉత్కంఠతకు' పార్టీ అధిష్టానం గురువారం తెరవేసింది. రెండవ విడత జాబితాలో శ్రీకాళహస్తి తెలుగుదేశం,జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడు ప్రకటించారు. దాంతో ఊరూవాడ సంబరాలు జరిగాయి. పట్టణంలోనూ, పరిసరాల్లోని గ్రామాల్లోనూ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున బాణ సంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు.శ్రీకాళహస్తి నియోజక వర్గంలో బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి రెండవ సారి తెలుగుదేశం పార్టీ టిక్కెట్టుపై పోటీ చేస్తున్నారు. 2014లో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి శాసనసభ్యుడుగా గెలిచి మంత్రిగా ఉన్నపుడు దాదాపు పరిపాలన బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయన తల్లి బొజ్జల బృందమ్మ కనుసన్నల్లో సాగింది.ఈ నేపథ్యంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో గోపాలకృష్ణారెడ్డి అనారోగ్యం కారణంతో బొజ్జల సుధీర్‌రెడ్డికి అవకాశం కల్పించాలని తెలుగుదేశం పార్టీని కోరారు. ఈ నేపథ్యంలో చివరి వరకు పార్టీ అధిష్టాన వర్గం నిర్ణయం తీసుకోలేదు. చివరకు ప్రకటించారు. అయితే ఈ ఎన్నికల్లో ఆయన ప్రస్తుత శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి చేతిలో ఓడిపోయారు. తెలుగుదేశం పార్టీకి ఎన్నడూ లేని పరాభవం చోటు చేసుకుంది. నియోజకవర్గ చరిత్రలో లేని విధంగా ప్రత్యర్థిగా పోటీ చేసిన వైకాపా అభ్యర్థి సుమారు 39వేల ఓట్ల మెజారిటితో గెలుపొందారు.

## చంద్రగిరి కోటపై టిడిపి జెండా రెపరెపలు ఖాయం..!

**పులివర్తి నాని అభ్యర్థిత్వం ఖరారుతో భారీ బైక్ ర్యాలీ**



చంద్రగిరి, మార్చి 14 ప్రభాతవార్త: నాపై నమ్మకంతో మరోసారి టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థిగా అవకాశం కల్పించిన నా ఆరాధ్య నాయకుడు మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు జీవిత కాలం రుణపడి వుంటానని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. చారిత్రాత్మక చంద్రగిరి నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పులివర్తి నాని పేరును ఖరారు చేస్తూ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం రెండవ జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉప్పొంగిన అభిమానంతో పోటెత్తిన పసుపుదళం తమ అభిమాన నాయకుడు పులివర్తి నానికి టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థిత్వం ఖరారుతో క్యాడర్ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తెలుగు తమ్ముళ్ళకు తమ నాయకుడి పేరును ప్రకటించడంతో ఒక్కసారిగా అభిమానం కట్టలు తెంచుకున్నది. మండల వ్యాప్తంగా గల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బైపాస్ రోడ్డు వద్దకు చేరుకున్నారు. భాణాసంఛా పేలుళ్ళు, కార్యకర్తల జయజయ నినాదాల నడుమ బైక్ ర్యాలీ ప్రారంభించారు. చంద్రగిరి నుండి నారావారిపల్లి వరకు సాగిన బైక్ ర్యాలీకి దారి పొడవునా ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నారావారిపల్లిలో ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే అవకాశం కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, సింగు సుధ, కొండూరు ప్రవీణ్ రాయల్, సక్కుర్ ధనంజయ రెడ్డి, ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, సజ్జా పురుషోత్తం నాయుడు, రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, కాపువీధి సునీల్, శానంబట్ల తులసి రెడ్డి, మండలం లోకేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.